







ఇంటికి టాటా.. బడికి బాట

వేసవి సెలవులు ముగిసిన అనంతరం పాఠశాలలు తిరిగి బుధవారం ప్రారంభమయ్యాయి. ఇన్నిరోజులు తల్లిదండ్రులతో ఆటా పాటలతో మునిగితేలిన చిన్నారులు తిరిగి బడి బాట పట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వేసవి సెలవులు ముగిసిన అనంతరం తొలి రోజు పాఠశాలకు హాజరు కావడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఉత్సాహంగా గడిపారు. పాఠశాలల ప్రారంభం రోజు ఉచిత పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. కొత్త ఏడాది ప్రారంభంలో తమ పిల్లల బంగారు భవిష్యత్‌ను ఆశించి తల్లిదండ్రులు పిల్లల్ని పాఠశాల వరకు వచ్చి దింపివేశారు. బుధవారం పట్టణంలోని వివిధ పాఠశాలల ముందు కనిపించిన దృశ్యాలివీ.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల జిల్లా

సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భాస్కర్

సిరిసిల్ల: సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆడెపు భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ పాలకవర్గం మొత్తం ఇప్పటికే ఏకగ్రీవం కాగా.. అధ్యక్ష పదవికి ఆడెపు భాస్కర్, మోర రాజులు పోటీ పడ్డారు. ఈనెల 14న అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగాల్సి ఉండగా.. పాలిస్టర్ అసోసియేషన్ పెద్దలు బుధవారం పోటీలో ఉన్న భాస్కర్, రాజులతో చర్చలు జరిపినట్లు సమాచారం. మోర రాజు పోటీ నుంచి తప్పుకునేలా పెద్దలు ఒప్పించడంతో పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆడెపు భాస్కర్ ఏకగ్రీవమయ్యారు. 14న జరిగే ఎన్నికలు లాంఛనప్రాయంగా భావిస్తున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

వీర్నపల్లి: మండలంలోని ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారి చాడ భూమిరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. రైతులకు కల్తీ విత్తనాలను అమ్మితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులను పరిశీలించారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీధర్ రెడ్డి, తదితరులున్నారు.

క్లుప్తంగా

మంత్రి పొన్నంకు వినతి

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి సరిపడా ఆర్టీసీ బస్సులు నడవడం లేదని ఫలితంగా ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ బీసీసెల్ మండల అధ్యక్షుడు గుర్రం రాజుగౌడ్ బుధవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. సానుకూలంగా మంత్రి స్పందించారని, కామారెడ్డి, దుబ్బాక డిపోల నుంచి బస్సులు వచ్చేలా చూస్తానని చెప్పినట్లు రాజుగౌడ్ పేర్కొన్నారు.

పోలీసుల తనిఖీ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీ నిర్వహించారు. మద్యంతాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 11 వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్సై కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

సిరిసిల్లటౌన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని బీజేపీ కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు నిలిచాయని వెంటనే అందించాలని కోరారు. పట్టణ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.


వాటర్‌ఫిల్టర్ అందజేత



రంగు వెంకటేశం అందించిన వాటర్‌ఫిల్టర్

వేములవాడరూరల్: ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాలనే సంకల్పంతో తల్లిదండ్రుల పేరిట తాగునీటి ఫిల్టర్‌ను అందించి వేములవాడ రూరల్ మండలం వట్టెంల ఎంపీటీసీ రంగు వెంకటేశం గౌడ్ వాటర్ ఫిల్టర్‌ను అందించారు. వివరాల్లోకి వెళితే.. తన ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు కోసం తల్లిదండ్రులు రంగు భాగ్యలక్ష్మి–నారాయణ పేరిట దాదాపు రూ. 60 వేల విలువైన వాటర్ ఫిల్టర్ అందించారు. దీనిపై గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కరాటే బెల్టుల ప్రదానం



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

వేములవాడ: వేములవాడ ఓకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కరాటే గ్రేటింగ్ టెస్టింగ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నాన్, కరాటే కోచర్ కనికరపు రాకేశ్, బ్లాక్‌బెల్ట్ గ్రహీతలు అప్సర్, ప్రతాప రిషిక్ తేజ, విజయ్‌కుమార్, కరాటేస్టూడెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలోని ఎస్సీ హాస్టల్‌లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ శ్రీనివాస్ తెలిపారు. హాస్టల్‌లో 1- పదో తరగతి వరకు చదివే బాలురకు అడ్మిషన్లు ఇస్తామని, విద్యార్థులు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, తదితర ధ్రువపత్రాలతో సంప్రదించాలని కోరారు. హాస్టల్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు వేడినీరు. 4జతల దుస్తులు, 2 దుప్పట్లు, చెప్పులు, బూట్లు తదితర అన్ని రకాల వసతులతో పాటు ఏడాదికి సరిపడా నోట్‌బుక్స్ అందించనున్నట్లు పేర్కొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



వేములవాడరూరల్: విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్



బోయినపల్లి: యూనిఫామ్స్ పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



తంగళ్లపల్లిలో యూనిఫామ్స్, పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ మానస

- ప్రభుత్వ విద్య బలోపేతమే లక్ష్యం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేత

వేములవాడరూరల్: కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం బడి బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని మర్రిపల్లిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు యూనిఫామ్స్, పుస్తకాలు, నోట్‌బుక్స్ అందించారు. చిటుమల్ల సౌజన్య సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం యాదవ్, ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోయినపల్లి: ప్రభుత్వం విద్యకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని విలాసాగర్ హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందించారు. అమ్మ ఆదర్శ కమిటీలతో సర్కారు బడుల్లో సకల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టిపల్లి సుధాకర్, కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, ఏనుగుల కనుకయ్య, మహేశ్‌రెడ్డి, ఉపేందర్, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో బీమా జయశీల, ఎంఈవో శ్రీనివాస దీక్షిత్, వన్నెల రమణారెడ్డి, నాయకులు పులి లక్ష్మీపతి, జోగు రవీందర్, ఏనుగుల ప్రశాంత్, సంబ లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జెడ్పీటీసీ గుండం నర్సయ్య అన్నారు. ముస్తాబాద్, ఆవునూర్, గూడెం, కొండాపూర్, పోతుగల్ గ్రామాల్లో నిర్వహించిన బడి బాటలో పాల్గొన్నారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందించారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్, లలిత, మంజుల, స్వేచ్ఛ, బాలకిషన్, హెచ్‌ఎంలు రాధాకిషన్‌రావు, లక్ష్మణ్, రాజిరెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

వేములవాడ అర్బన్: వేములవాడ పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బడిబాట పట్టారు. మొదటి రోజు కావడంతో విద్యార్థుల సంఖ్య తగ్గినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలు అందించారు.

తంగళ్లపల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అంజేస్తున్న యూనిఫాం, టెక్స్ట్ బుక్స్ పంపిణీని బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. తంగళ్లపల్లి తోపాటు, ఓబులాపూర్, తాడూర్, నేరెళ్ల పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, బుక్స్ అందజేశారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్, ఎల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీటీసీ సభ్యులు నాగరాణి, అనసూయ, గీతాంజలి, ప్రధానోపాధ్యాయుడు కుబేర స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని ప్రభుత్వ బడుల్లో పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంపీపీ మాలోత్ భూల, ఎంపీటీసి అరుణ్ కుమార్ పుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు.

సినారెకు ఘన నివాళి



సిరిసిల్ల టౌన్: నివాళి అర్పిస్తున్న సాహితీవేత్తలు

సిరిసిల్లటౌన్: 'జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి. నారాయణరెడ్డి వర్ధంతిని బుధవారం జిల్లా కవులు ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీచౌక్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. సాహిత్యంలో తనదైన శైలితో దేశంలోనే అత్యున్నత పురస్కారాలు అందుకున్న సినారె జీవితం అందరికీ ఆదర్శంగా పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలగొండ రవి, వెంగళ లక్ష్మణ్, జూకంటి జగన్నాథం, ఆడెపు లక్ష్మణ్, బూర దేవానందం, నారాయణ, గణేశ్, వంశీ, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: జ్ఞానపీఠ అవార్డు మాజీ రాజ్యసభ సభ్యుడు స్వర్గీయ సినారె సొంత గ్రామమైన హన్మాజీపేటను మండలంగా మార్చాలని గ్రామస్తులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు. పార్లమెంట్ సభ్యులుగా ఎన్నో నిధులు కేటాయించిన ఆయన గుర్తుగా హన్మాజీపేట మండలంగా ప్రకటించి ఆయన పేరు పెట్టాలని వారు విన్నవించారు. వేములవాడ మండలంలో ఉన్న మల్లారం, హన్మాజీపేట, బొల్లారం, మర్రిపల్లి గ్రామాలతోపాటు సుద్దాల, మంగళ్లపల్లి, మామిడిపల్లి, ఎన్గల్, మూడపల్లి పది గ్రామాలను కలిపి మండలంగా ప్రకటించాలని కోరారు. ఆయా గ్రామాలు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సెస్ కార్యాలయం ఎదుట నిరసన



సెస్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో విద్యుత్ సమస్యలపై బుధవారం గ్రామస్తులు సెస్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. పంటపొలాల్లో కరెంట్ వైర్లు వేలాడుతున్నాయని, రైతులు ప్రమాదం అంచున వ్యవసాయ పనులు చేసుకోవాల్సి వస్తుందని ఆరోపించారు. రైతులు మాట్లాడుతూ.. గ్రామాల్లో లూజ్ లైన్ పోల్స్, మిడిల్ పోల్స్, లో వోల్టేజీతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. 200 యూనిట్లలోపు జీరో బిల్లు అందరికీ వచ్చేలా చూడాలని కోరారు. గ్రామంలో 8 వేల విద్యుత్ కనెక్షన్‌లు ఉండగా, కేవలం ఒక్క హెల్పర్ మాత్రమే విధులు నిర్వహించడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. కిష్టంపల్లిలో విద్యుత్ బిల్లులు చెల్లించడానికి కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన ఫిర్యాదును అధికారులకు సమర్పించారు. మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్, రైతులు సంతోష్‌గౌడ్, తిరుపతిగౌడ్, బాలయ్య, శ్రీనివాస్, గోపి, రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, మురళీ, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేవయ్య, అరుణ్‌కుమార్, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొరత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లో రైతులకు వ్యవసాయశాఖ అధికారులు విత్తనాల కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. దళారులు వరి, పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయించకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఇప్పటికే వానాకాలం ప్రారంభమైందని రైతులు పంటలు వేయడానికి భూమిని చదును చేసుకొని సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు అందించి వ్యాపారులు, అధికారులు సహకరించాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు లింగంగౌడ్, బండారి బాల్‌రెడ్డి, రాములు, రాజునాయక్ పాల్గొన్నారు.

సన్మానం



గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట మోడల్‌స్కూల్ పూర్వ విద్యార్థులు కల్యాణ్, రంజిత్ ఆర్మీకి ఎంపికయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్ ఇరువురిని బుధవారం సన్మానించారు. అనంతరం జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఉన్నత లక్ష్యాల సాధించే దిశగా విద్యార్థులు పయనించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విజయ్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో రేవంత్ మిత్ర మండలి టీమ్ జిల్లా అధ్యక్షుడు మండలంలోని కోరుట్లపేటకు చెందిన గూడ విజయ్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను సన్మానించారు. జిల్లాలోని పలు సమస్యలపై సీఎంకు వినతిపత్రం ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా సీఎం స్పందించినట్లు విజయ్‌రెడ్డి తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేస్తున్న విజయ్‌రెడ్డికి జిల్లాస్థాయి నామినేటెట్ పదవి ఇవ్వనున్నట్లు సీఎం పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మ కాలనీ గ్రామంలో బుధవారం వేముల కిషన్ (42) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కిషన్ కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భార్య కొడుకు, కూతురితో కలిసి దూరంగా ఉంటోంది. మనస్తాపానికి గురైన కిషన్ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి తండ్రి, తల్లి ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

అందరి సహకారంతోనే మండల అభివృద్ధి

- రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి



రుద్రంగి: మాట్లాడుతున్న ఎంపీపీ స్వరూపారాణి

రుద్రంగి: అందరి సహకారంతోనే మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపీపీ గంగం స్వరూపారాణి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. అధికారులు మూడు నెలల ప్రగతి ప్రణాళికతో సర్వసభ్య సమావేశానికి హాజరై చదివి వినిపించారు. మండలంలోని పలు సమస్యలపై సమావేశంలో చర్చించి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీపీ, ఎంపీటీసీల పదవికాలం ముగుస్తుండడంతో మండల అధికారులు ఎంపీపీ, ఎంపీటీసీలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య, ఎంపీటీసీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వాడివేడిగా జరిగింది. సర్పంచుల పదవికాలం ముగియడంతో వారి స్థానంలో స్పెషల్ అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ఎంపీటీసీ బైరినేని రాము మాట్లాడుతూ పలు అంశాలపై ఐసీడీఎస్, ఆర్టీసీ, మిషన్ భగీరథ, విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. ఎంపీటీసీ ములిగె దుర్గాప్రసాద్, కరుకబోయిన కుంటయ్య, చెన్నమనేని వెంకట్రావు మాట్లాడుతూ సెస్ అధికారుల తీరుపై విమర్శించారు. పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ పదవికాలం ముగుస్తున్నపటికీ సమస్యలు పరిష్కరించలేదన్నారు. వైస్ ఎంపీపీ అంజయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో జోగం రాజు, సింగిల్‌విండో చైర్మన్లు దేవదాస్, భాస్కర్, ఎంఈవో రఘుపతి, ఎంపీటీసీలు కోడి అంతయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఏఈపై ఆగ్రహం

మండలంలోని జిల్లెల్లలోని కొత్త చెరువు శిఖం భూమిని కబ్జా చేయకుండా అడ్డుకున్నందుకు ఇరిగేషన్ ఏఈపై జిల్లెల్ల ఎంపీటీసీ చెన్నమనేని వెంకట్రావు, నేరెళ్ల సింగిల్‌విండో చైర్మన్ కోడూరి భాస్కర్ ఏకంగా మండల సర్వసభ్య సమావేశంలోనే ఆగ్రహం వ్యక్తం చేయడం అధికారులు సభ్యులను విస్మయానికి గురిచేసింది. గ్రామంలోని కొత్తచెరువు శిఖం భూమి సుమారు ఆరెకరాలు కబ్జాకు గురవుతోందని జిల్లెల్ల రైతు సంక్షేమ సంఘం సభ్యులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఇరిగేషన్ ఏఈ రాహులి రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే నిర్వహించి కబ్జా జరిగినట్లు నిర్ధారించారు. గ్రామానికి చెందిన తన్నీరు గోపాల్ రావు, అబ్బాడి మల్లారెడ్డి, కొడ్రపేట బాల్‌రెడ్డిలు కబ్జాకు పాల్పడుతున్నట్లు గుర్తించి వారితో మాట్లాడగా స్పందించకపోవడంతో వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కబ్జాకు పాల్పడ్డారని రైతులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఎలా చేశారని ఎంపీటీసీ వెంకట్రావు, సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహులి బదులిస్తూ కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నామన్నారు.

సంక్షిప్త వార్తలు

14న కలెక్టరేట్ ఎదుట నేతకార్మికుల ధర్నా

సిరిసిల్ల: సిరిసిల్లలో బతుకమ్మ చీరలు నేసిన కార్మికులకు ప్రభుత్వం ద్వారా రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ కోసం ఈనెల 14న శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని సీఐటీయూ నాయకులు మూషం రమేశ్, కోడం రమణలు తెలిపారు. 2022లో బతుకమ్మ చీరలు ఉత్పత్తి చేసిన కార్మికులకు 5200 మంది యారన్ సబ్సిడీ రావాల్సి ఉండగా.. కేవలం 600 మందికి మాత్రమే వచ్చాయని వారు వివరించారు. 2023లో బతుకమ్మ చీరలు నేసిన కార్మికులకు ఇంకా యారన్ సబ్సిడీ రాలేదన్నారు. పవర్‌లూమ్ కార్మికులు అందరూ ఈ ధర్నాకు హాజరు కావాలని కోరారు.

మున్నూరుకాపులు రాజకీయంగా ఎదగాలి

సిరిసిల్లటౌన్: మున్నూరుకాపులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో నిర్వహించిన నూతన పాలకవర్గం సమావేశంలో మాట్లాడారు. సంఘం భవన నిర్మాణానికి గత ప్రభుత్వం అందించిన రెండెకరాల స్థలంలో నిర్మిస్తామన్నారు. గ్రామ, ప్రభుత్వ ఉద్యోగుల కమిటీలతో సంఘాన్ని మరింత పటిష్టం చేస్తామన్నారు. సంఘం పెద్దలు, పాలకవర్గం పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూర్గుల నందయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్‌కు చెందిన ఫిరోజ్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి అప్పగించారు. ఫిరోజ్ గతనెల 29న తన ఫోన్ పోయినట్లు పోలీస్‌స్టేషన్‌ల ఫిర్యాదు చేశాడు. ఐఎంఈఐ ద్వారా ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

ఉపాధిహామీ గ్రామసభలు

వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు రంగంపేట, కంచర్ల గ్రామంలో ఉపాధిహామీ మూడో విడత సామాజిక తనిఖీల గ్రామసభలను బుధవారం నిర్వహించారు. మండలకేంద్రంలో ప్రత్యేకాధికారి ఇరిగేషన్ డీఈ వినోద్ కుమార్ మాట్లాడారు. 2023– 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలకేంద్రంలో ఇప్పటివరకు రూ.58 లక్షల ఖర్చుచేసినట్లు తెలిపారు. మండల ఏపీఓ శ్రీహరి ఎంపీటీసీ అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం, డీఆర్‌పీ రమేశ్, పాల్గొన్నారు.

పాఠశాల భవనంపై కూలిన చెట్టు

చందుర్తి : మండలంలో తెల్లవారుజామున కురిసిన వర్షానికి నర్సింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల భవనంపై చెట్టు విరిగిపడింది. పాఠశాల ప్రారంభోత్సవ రోజున చెట్టు కూలిన వాటిని తొలగించాలన్న ధ్యాస ఉపాధ్యాయుల్లో, ప్రజాప్రతినిధుల్లో కరువైంది.

బ్లాక్ ఫిలిం పెడితే చర్యలు

ముస్తాబాద్: కార్లకు బ్లాక్ ఫిలిం పెడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై శేఖర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్లు, జీపుల అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉన్న వాటిని తొలగించారు. ఎస్సై మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నిర్వహించవద్దన్నారు. కార్లకు అద్దాలు పారదర్శకంగానే ఉండాలన్నారు. పలు వాహనాల బ్లాక్ ఫిలిం తీసివేయించగా, పలువురికి జరిమానాలు విధించారు.

ప్రజాపాలన ఫిర్యాదులు స్వీకరిస్తాం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు ఎంపీపీ వుట్కూరి వెంకట రమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.

ఉన్నతాధికారికి చిరిగిన శేషవస్త్రం అందజేత

- ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారి
- ప్రత్యేక నూతన శేషవస్త్రం అందించిన అర్చకులు

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన ఓ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారికి ఆలయ అధికారులు ఆలయ సాంప్రదాయాలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అందించే శేషవస్త్రం చిరిగిపోయి ఉండటంతో సదరు అధికారి ఆలయ అధికారులపై అగ్రహం వ్యక్తంచేసినట్లు తెలిసింది. దీంతో ఈవోను పిలిపించి జరిగిన తీరును వివరించినట్లు తెలిసింది. జరిగిన పొరపాటును గుర్తించిన అధికారులు తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేశారు. ఈవో, అర్చకులు, ప్రత్యేకంగా హైదరాబాద్‌లో ఉన్న రాష్ట్రస్థాయి అధికారి ఇంటికి చేరుకుని కొత్త చీర, అర్చకులతో ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదాలు అందించినట్లు ఆలయ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. కిందిస్థాయి ఉద్యోగులపై ఈవో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ముస్తాబాద్: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కరికే నాంపెల్లి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, బాధిత కుటుంబానికి రూ.35వేల నగదు, క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు విజ్ఞప్తి మేరకు రూ. 30వేలు పోగు చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి రూ.5వేలు అందించగా రూ.35వేల నగదును అందించారు.